# విష ఫలితం

రాత్రి ఒంటిగంట వరకూ ఒక కథ రాస్తూ కూర్చుంది సుమిత్ర.... నిద్ర వస్తున్నా బలవంతాన నిద్రను ఆపుకుని మూడుసార్లు కాఫీ చేసుకుని తాగి చివరకు ఒంటిగంట దాటి పది నిమిషాలు అవుతున్నప్పుడు ఆ కథను పూర్తి చేసింది.

టేబుల్ పక్కనే ఉన్న ఫోమ్‌బెడ్ మీద బోర్లా పడుకుని నిద్రపోతున్నాడు ఆమె భర్త మధ్యలో రెండుసార్లు మెలకువ వచ్చినప్పుడు తలెత్తి చూసి భార్యను డిస్టర్బ్ చెయ్యడం ఇష్టంలేక తిరిగి నిద్రలో మునిగిపోయాడు.

సుమిత్ర ఒక రచయిత్రి. ఆమె క్రమం తప్పకుండా నెలకు రెండు కథలు రాస్తుంది. కథను రాసేటప్పుడు తనని కదిలించవద్దని ఇంతకుముందు భర్తకు చెప్పింది ఆమె. సుమిత్ర కథ రాయటం మొదలుపెట్టిందంటే పూర్తి చేస్తేగానీ ఆపదు. అప్పుడే ఆమెకు తృప్తి. చాలామందిలాగా ఒక కథను కొన్ని రోజుల తరబడి రాయడం ఈమెకు ఇష్టం ఉండదు.

తర్వాత కథ రాసిన కాగితాలను క్లిప్పుకు పెట్టి లైటార్పి వెళ్లి భర్త పక్కన పడుకుని నిద్రపోయింది.

రాత్రి ఆలస్యంగా పడుకోవడంవలన ఆమె తెల్లవారి కొంచెం ఆలస్యంగా నిద్రలేచింది.

పనులన్నీ పూర్తి చేసుకుని భర్త ఆఫీసుకు వెళ్లిన తర్వాత ఉదయం పదకొండు గంటల సమయంలో రాత్రి రాసిన కథను ఫెయిర్ చేస్తూ కూర్చుంది. సరిగ్గా అప్పుడే వచ్చింది మాళవిక.

మాళవిక చేతిలో ఏవో కాగితాలున్నాయి. బాగా అలంకరించుకుని అందంగా వుంది. సుమిత్రను చూసి పలకరింపుగా నవ్వింది.

సుమిత్ర రాస్తున్న కాగితాలను పక్కనపెట్టి మాళవికను ఆహ్వానించింది.

"కొత్త కథను రాశారా?" అడిగింది మాళవిక ఆ కాగితాలను చూస్తూ. పైన తిరుగుతున్న ఫ్యానుగాలికి అవి ఎగురుతున్నాయి.

"అవును. నీ చేతిలో ఆ కాగితాలేమిటి? నువ్వు కూడా రాత్రి కథను రాశావా?" అనడిగింది సుమిత్ర.

మాళవిక సిగ్గుపడుతున్నట్టు నవ్వి "అవును. మీరు చదివి అవసరమైన

మార్పులు చెయ్యాలి" అన్నది ఆ కాగితాలను సుమిత్రకు ఇస్తూ.

ఈమధ్యనే మాళవిక కథలు రాయటం మొదలుపెట్టింది. ఆ వూళ్లోనే వుంటున్న తనకంటే బాగా సీనియర్ రచయిత్రి సుమిత్రతో పరిచయం చేసుకుని తను రాసిన కథలను ఆమెకు చూపించి కథలు రాయటంలో మెళకువలను తెలుసుకుంటున్నది.

ఆ వూళ్లోనే వున్న ఒక ప్రయివేటు కంపెనీలో మాళవిక స్టెనోగా ఉద్యోగం చేస్తోంది.

సుమిత్ర ఆ కథను ఆసక్తిగా చదువుతున్నప్పుడు–

"నేను మీనించి ఒక సలహాకోసం వచ్చాను" అన్నది మాళవిక చిన్నగా.

"ఏమిటి?" ఆశ్చర్యంతో అడిగింది సుమిత్ర.

"మీరొక రచయిత్రి. సాధారణమయిన మనుషులకంటే తెలివైనవారు. అందువల్ల మీరయితే సరయిన సలహా ఇవ్వగలరని అతను కూడా చెప్పాడు" అన్నది మాళవిక.

"అతనా?.... అతనంటే ఎవరు?...." మళ్లీ ఆశ్చర్యపడుతూ అడిగింది.

"అతనంటే నా మగ స్నేహితుడు" చిన్నగా నవ్వింది.

"నీకో మగ స్నేహితుడు కూడా ఉన్నాడా....? ఎవరతను?" ఆసక్తిగా అడిగింది సుమిత్ర చేతిలో ఉన్న కాగితాలను పక్కనే పడేసి.

"ఈమధ్య ప్రేమలో పడ్డాను" సిగ్గుపడుతూ మాళవిక చెప్పింది.

"ఎవరితో? క్లియర్‌గా చెప్పు మాళవికా?"

"ఓ పెళ్లయిన మనిషితో"

"పెళ్లికాని నువ్వు ఒక పెళ్లయిన మనిషిని ప్రేమించావా? నమ్మలేకుండా వున్నాను" అన్నది సుమిత్ర.

"నమ్మక తప్పదు. మొదటిచూపులో ప్రేమ అంటే ఇదేనేమో. మొదటిసారి మేమిద్దరం ఒకరినొకరు చూసుకున్నప్పుడే ఒకరంటే ఒకరికి ప్రేమ, ఇష్టం కలిగాయి. అప్పటినించీ రోజూ కలుసుకుంటూనే ఉన్నాం. మాట్లాడుకుంటూనే ఉన్నాం. కానీ అతను ఈమధ్యనే నన్ను ఒక విషయం గురించి బాగా వేధిస్తున్నాడు" అన్నది మాళవిక.

"ఏ విషయం గురించి?" కుతూహలంగా అడిగింది సుమిత్ర.

"ఇలా పార్కులోనో, థియేటర్లోనో కలుసుకుని మాట్లాడుకున్నందువల్ల నాకు తృప్తి కలగటంలేదు. అందువల్ల మనిద్దరం ఏకాంతంగా కలుసుకుని ఒక రాత్రి నీతో గడపాలి. అప్పుడే నాకు తృప్తి" అంటున్నాడని చెప్పింది మాళవిక.

"అతడి కోరిక నీక్కూడా ఇష్టమేనా....?" సుమిత్ర అడిగింది.

మాళవిక తల వూపింది.

"ఐతే ఇంక ఆలస్యం ఎందుకు? కలుసుకోండి" అన్నది సుమిత్ర నవ్వుతూ.

"నిజమే కానీ ఎక్కడ కలుసుకోవాలో తెలీటంలేదు. అదే సమస్య...." మాళవిక కూడా నవ్వుతూ అన్నది.

"ఏదైనా హొటల్‌లో రూమ్ బుక్ చేసుకోండి"

"నేనూ అదే అన్నాను. కానీ అతను అందుకు ఒప్పుకోలేదు.... రెయిడింగ్ జరిగే ప్రమాదం వుందని అన్నాడు"

"నిజమే అతడి ఆలోచన కూడా సరయినదే. సేఫ్టీ ముఖ్యం కదా! హొటలు వద్దు...." అన్నది సుమిత్ర.

"మరి ఇంకెలా కలుసుకోవాలి?" అనడిగింది మాళవిక.

"అతనికి పెళ్లయిందన్నావు కదా!... పిల్లలున్నారా?"

"లేరు"

సుమిత్ర కొంచెంసేపు ఆలోచించి "ఐతే అతని ఇంట్లోనే కలుసుకోండి" అన్నది నవ్వి.

"అతని భార్య వుంటుంది కదా! ఎలా?"

"భార్యవైపు వాళ్ల ఇంట్లో పెళ్లిలాంటిది ఏమైనా జరిగినప్పుడు అతను వెళ్లకుండా, ఆమెను ............... పంపించమని చెప్పు. అప్పుడు మీరిద్దరూ వాళ్లింట్లోనే కలుసుకోవచ్చు. ఇంతకుమించి మరో అవకాశం లేదు. అవకాశం వచ్చే వరకూ ఎదురుచూడండి" అన్నది సుమిత్ర.

మాళవిక – సుమిత్రకు థ్యాంక్స్ చెప్పి తన కథ కాగితాలను తీసుకుని వెళ్లిపోయింది.

❖ ❖ ❖

మరుసటి రోజు.

సుమిత్ర - ఉదయం ఆఫీసుకు వెళుతున్న భర్తతో మధ్యాహ్నం భోజనానికి ఇంటికి రావద్దని చెప్పింది. ఎందుకంటే తను పక్కింటావిడతో కలిసి హేండ్లూమ్ శారీస్ ఎగ్జిబిషన్‌కు వెళుతున్నానని చెప్పింది. అతడు వెళ్లిపోయాడు.

సుమిత్ర మధ్యాహ్నం పక్కింటావిడతో శారీ ఎగ్జిబిషన్‌కు వెళ్లి రెండు గంటల తర్వాత వచ్చి ఇంటి గేటు తెరుస్తున్నప్పుడు ఎదురింటి రాధాదేవి సుమిత్రను పిలిచి ఇలా చెప్పింది....

"మీరు వెళ్లిన గంటసేపటికి తిరుపతి నించి మీ అన్నయ్య గోవిందరావు ఫోన్ చేశాడు. మిమ్మల్ని పిలవమన్నాడు. మీ ఇంటికి తాళంపెట్టి వుంది. ఆ మాటే చెప్పాను. అయితే మీకో విషయం వెంటనే చెప్పమన్నాడు. మీ నాన్నగారి ఆరోగ్యం బాగా దెబ్బతిని హాస్పిటల్‌లో చేర్చాడుట. మిమ్మల్ని వెంటనే బయల్దేరి రమ్మని చెప్పాడు. అశ్రద్ధ చెయ్యొద్దని మరీ మరీ చెప్పాడు".

అక్కడే కూలబడింది సుమిత్ర ఆ వార్త విని. సుమిత్ర ఇంట్లో ఫోన్ లేదు. ఏదయినా విషయం వుంటే ఎదురింటి రాధాదేవికి ఫోన్ చేసి చెబుతారు. తండ్రికి ఇప్పుడు ఎలా ఉందో తెలుసుకుందామన్నా తిరుపతిలో ఉన్న తండ్రి ఇంటో కూడా ఫోన్ లేదు.

అందువల్ల సుమిత్ర గబగబా బట్టలు సర్దుకుని బయటకు వచ్చి భర్త ఆఫీసుకు ఫోన్ చేసి అతడికి విషయం చెప్పి, తను తిరుపతి వెళుతున్నానని, తిరిగి ఎప్పుడు వచ్చేదీ మళ్లీ ఆఫీసుకు ఫోన్ చేసి చెబుతానని భర్తకు చెప్పి బస్టాండుకు వెళ్లింది.

రోజూలాగే ఆరోజూ సాయంత్రం ఆరు గంటలకు సుమిత్ర భర్త ఇంటికి రాలేదు. స్నేహితులతో గడిపి హోటల్లో భోజనం చేసి రాత్రి ఎనిమిదిన్నరకు ఇల్లు చేరాడు.

స్నానం చేసి లుంగీ కట్టుకుని గేటు బార్లా తెరచిపెట్టి ముందుగదిలో కుర్చీ వేసుకుని మాళవిక రాకకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

మాళవిక తన ప్రియుడితో ఏకాంతంగా గడపటానికి సలహా ఇచ్చి తన గొయ్యి తానే తవ్వుకున్నదనీ, సుమిత్ర అన్నయ్య గోవిందరావులాగా ఎదురింటి రాధాదేవితో తన భర్త అనంత పద్మనాభరావే మాట్లాడాడనే నిజం సుమిత్రకు ఎప్పటికి తెలుస్తుందో ఎవరికీ తెలీదు. ❖

*మల్లెతీగ మాసపత్రిక, అక్టోబరు 2008*